క్లుప్తంగా

పాఠశాలల పరిశీలన



కేజీబీవీలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీపీ కర్నేన దీప

బూర్జ: మండలంలోని కొల్లివలస కేజీబీవీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాలను ఎంపీపీ కర్నేన దీప పరిశీలించారు. శుక్రవారం ఆమె పాఠశాలలకు వెళ్లి సిబ్బంది పనితీరు, విద్యార్థుల పరిస్థితి, మధ్యాహ్న భోజన పథకం నాణ్యత, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య, రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ కె.గాయత్రి, బి.రాంబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న సమన్వయాధికారి గ్రేస్

పాతపట్నం: పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ఇప్పటినుంచే ప్రణాళిక తయారు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల జిల్లా సమన్వయాధికారి జి.గ్రేస్ అన్నారు. మండలంలోని ప్రహరాజపాలేంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం ఆకస్మికంగా ఆమె తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని, ఎటువంటి ఒత్తిడి లేకుండా చూడాలన్నారు. విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆమెతో పాటు ప్రిన్సిపాల్ పి.పద్మావతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

కనీస వేతనం అందజేయాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్

ఆమదాలవలస: సుప్రీంకోర్టు ఆదేశాలు ప్రకారం కనీస వేతనం రూ.18,600లు అందజేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని జొన్నవలస కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) వద్ద శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పెరిగిన ధరలకు అనుకూలంగా జీవనం సాగించేందుకు సీహెచ్‌సీల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు పెంచాలని కోరారు. అలాగే వీక్లీ ఆఫ్, క్యాజువల్ లీవ్స్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌సీలో పని చేస్తున్న కార్మికులు మూకాళ్ల అప్పలనాయుడు, గన్నారెడ్డి పావని, గుర్రం దేవి, కదిరి సుశీల, గోక రమేష్, శనగల రవణమ్మ, చిట్టువలస శ్రీను, గన్నారెడ్డి వసంత, ఈశెట్టి గోపి, మురపాక మురళీధర్, దుబా ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.


ఎరువుల పంపిణీ సక్రమంగా చేపట్టాలి



దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఆర్డీవో సాయి ప్రత్యూష తదితరులు

ఆమదాలవలస: ఎరువుల పంపిణీ సక్రమంగా చేపట్టాలని ఆర్డీవో సాయిప్రత్యూష సూచించారు. పట్టణంలోని ఎరువులు, పురుగుల మందు దుకాణంలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. అయితే ఆ దుకాణంలో ఇంతవరకు అందించిన ఎరువులు రైతులకు అందజేయడంతో.. నిల్వలు లేవని దుకాణం యజమాని తెలిపారు. రికార్డులు పరిశీలిస్తామని చెప్పగా ఎటువంటి రికార్డు ఆ దుకాణంలో లేకపోవడంతో ఆర్డీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న రెండు రోజుల్లో ఆ దుకాణానికి యూరియా బ్యాగ్‌లు ఎలాట్ చేయనున్నామని, దానికి సంబంధించి రికార్డుల నిర్వహణ చేపట్టాలని సూచించారు. పరిశీలనలో తహసీల్దార్ ఎస్.రాంబాబు, ఏవో మెట్ట మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీమా సేవలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న బీఎం వెంకటనారాయణ

హిరమండలం: బీమా సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎల్ఎన్‌పేట విశాఖ గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ వెంకటనారాయణ అన్నారు. శుక్రవారం ఎల్ఎన్‌పేటలో కేంద్ర బీమా పథకాలపై అవగాహన కల్పించారు. విధిగా ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతాలను పొంది ఉండాలన్నారు. పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై బీమా సేవలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది ఏడు కొండలతో పాటు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

భవితకు భరోసా..!



నరసన్నపేట భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు విద్య నేర్పుతున్న దృశ్యం

- దివ్యాంగ చిన్నారులను అక్కున చేర్చుకుంటున్న భవిత కేంద్రాలు
- 21 రకాల సేవలతో కూడిన సహిత విద్య
- వారంలో ఒకరోజు ఫిజియోథెరపీ సేవలు

నరసన్నపేట: దివ్యాంగ చిన్నారులకు భవిత కేంద్రాలు ఆసరాగా నిలుస్తున్నాయి. కొన్నేళ్ల క్రితం వరకు సాధారణంగా ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు ఇంటికే పరిమితమయ్యేవారు. దీంతో వీరి తల్లిదండ్రులు వారిని ప్రత్యేక శ్రద్ధతో చూసుకోవాల్సి వచ్చేది. అయితే ప్రస్తుతం కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో భవిత కేంద్రాలు నిర్వహిస్తున్నారు. దీంతో ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల్లో నూతన ఉత్సాహం నింపి వారి మనోవికాసానికి బాటలు వేసేవిధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. గతంలో వారి వ్యక్తిగత పనులు కూడా చేసుకోలేని పిల్లలు, వారి అవసరాలను వారు సొంతంగా చేసుకొనే స్థితికి అభివృద్ధి చెందుతుండడంతో తల్లిదండ్రులు భవిత కేంద్రాల నిర్వహణపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అందజేసే సహిత విద్యను విద్యాశాఖలో భాగమైన సమగ్ర శిక్షా పథకం ద్వారా కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సంరక్షించి, వారికి 21 రకాల సేవలతో కూడిన సహిత విద్యను అందిస్తున్నారు. ప్రత్యేకంగా మధ్యాహ్న భోజనంతో పాటు మానసిక ఉల్లాసానికి అవసరమైన ఆటపాటలతో ఉత్తేజపరిచి వారిని ప్రోత్సహిస్తున్నారు. నరసన్నపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భవిత కేంద్రం నిర్వహిస్తున్నారు. అలాగే జలుమూరు మోడల్ ప్రైమరీలో, సారవకోట ఎంఆర్‌సీ పక్కన ఉన్న ప్రైమరీ స్కూల్లో, పోలాకి నర్సాపురం ఎంపీపీఎస్‌లో భవిత కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ప్రతీవారం ఫిజియోథెరపీ చేపడుతున్నారు. నరసన్నపేటలో సోమవారం చేస్తుండగా మిగిలిన మండలాల్లో ఇతర రోజుల్లో చేస్తున్నారు. ఇందులో వారికి శరీర వైకల్యాన్ని తగ్గించేందుకు తేలికపాటి యోగాసనాలు, ఎక్సర్ సైజులు గురించి వివరిస్తున్నారు. అలాగే తల్లిదండ్రులకు కూడా సూచనలు చేస్తున్నారు. మంచానికే పరిమితమైనవారిని వారంలో రెండుమార్లు గృహ సందర్శన చేసి, సహిత ఉపాధ్యాయులు ద్వారా వారికి అవసరమైన ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో భవిత కేంద్రాలకు అవసరమైన ప్రత్యేక పరికరాలను అందజేయడంతో పాటు వినికిడి, ఇతర అవసరాలు కలిగిన చిన్నారులను వీల్ చైర్లు, ట్రై సైకిళ్లు, హియరింగ్ మిషన్లు వంటి వివిధ రకాల పరికరాలు అందజేసింది.

నరసన్నపేట నియోజకవర్గంలో ప్రత్యేక అవసరాల పిల్లల వివరాలు				
మండలం	నరసన్నపేట	జలుమూరు	సారవకోట	పోలాకి
ప్రత్యేక అవసరాల పిల్లలు	218	132	164	154
భవిత కేంద్రానికి వచ్చే పిల్లలు	20	22	20	20

చురుకుతనం పెరిగింది



మా పాపకు 15 సంవత్సరాలు. చిన్నతనం నుంచి మానసిక దివ్యాంగతతో బాధపడుతోంది. అయితే భవిత కేంద్రానికి వచ్చినప్పటి నుంచి ఆమె ప్రవర్తనలో చైతన్యం వచ్చింది. చురుకుతనం పెరిగింది. రోజూ భవిత కేంద్రానికి తీసుకు వస్తున్నాం. ఆరోగ్యం పరంగా కూడా చాలా మెరుగ్గా ఉంటోంది.

– భాస్కరరావు, వజ్రంపేట, నరసన్నపేట

మార్పు వచ్చింది



మా అబ్బాయి మోహిత్ సాయికి మెదడుకు సంబంధించిన పక్షవాతం చిన్నతనంలో వచ్చింది. కాళ్లూ, చేతులు పని చేయవు. మొదట్లో అయితే చాలా ఇబ్బంది పడేవాళ్లం. భవిత కేంద్రానికి వస్తున్నప్పటి నుంచి ఎంతో మార్పు వచ్చింది. వీల్ చైర్ కూడా గత ప్రభుత్వంలో ఇచ్చారు. ఫిజియోథెరపీ చేయిస్తున్నాం.

– సంగూరి జ్యోతి, మెట్టపేట, జలుమూరు మండలం

తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి



ప్రత్యేక అవసరాల గల చిన్నారులపై వారి తల్లిదండ్రులు కూడా తగిన శ్రద్ధ చూపాలి. వారిని క్రమం తప్పకుండా భవిత కేంద్రానికి పంపించినప్పుడే వారిలో మనసిక ఉత్సాహం పెరుగుతుంది. రోజూ వారికి అవసరమైన శారీరక శిక్షణ కూడా అందజేయాలి.

– కృష్ణవేణి, ఐఈఆర్‌టీ, నరసన్నపేట

ఉపాధి అక్రమాలపై విచారణ



విచారణ చేపడుతున్న అధికారులు

సారవకోట: మండలంలోని గొర్రిబంద పంచాయతీలో ఉపాధి హామీ పథకం నిధుల్లో జరిగిన అక్రమాలపై ఏపీడీ కె.లోకేష్ శుక్రవారం గ్రామ సచివాలయంలో విచారణ చేపట్టారు. ఈ పంచాయతీ పరిధిలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడి ఒకే గోకులం షెడ్ నిర్మాణానికి రెండు సార్లు బిల్లు చేసుకున్నారని సాక్షి పత్రికలో ఇటీవల కథనం ప్రచురితమైంది. అనంతరం స్థానికులు దీనిపై కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడంతో ఫిర్యాదుదారులు, గ్రామస్తులు, పంచాయతీ సర్పంచ్ రూపవతిల సమక్షంలో విచారణ చేపట్టారు. ఉపాధి హామీ గ్రామస్థాయి సిబ్బందితో పాటు టెక్నికల్ అసిస్టెంట్లు నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఏపీడీ ఎదుట ఫిర్యాదుదారులు మరోసారి ఆరోపించారు. సంబంధించిన ఆధారాలను విచారణలో చూపించారు. అలాగే కోనవానిపేట గ్రామంలో ఉద్యానవన శాఖ ద్వారా మంజూరైన మొక్కలు రైతులకు అందజేయలేదని ఈ సందర్భంగా పలువురు ఏపీడీ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం అగుతుపురం గ్రామంలో ఒకే మినీ గోకులం షెడ్‌పై రెండుసార్లు బిల్లు మంజూరు చేసిన షెడ్ నిర్మాణాన్ని పరిశీలించారు. దీనిపై పూర్తిస్థాయి నివేదిక కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో నారాయణరావు, టెక్నికల్ అసిస్టెంట్ దామోదర్, మాజీ సర్పంచ్ పల్లి కృష్ణారావు, సడగాన రామారావు తదితరులు పాల్గొన్నారు.

క్వారీ నిర్వహణపై ప్రజాభిప్రాయ సేకరణ



అభిప్రాయ సేకరణ చేపడుతున్న అధికారులు

మెళియాపుట్టి: మండలంలోని బాణాపురం పంచాయతీ సుర్జిని గ్రామంలో శక్తి మూగాంబికా గ్రానైట్ క్వారీ(దుర్గమ్మ కొండలో) నిర్వహణకు సంబంధించి అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలువురు మాట్లాడుతూ క్వారీ వలన ప్రశాంతమైన జీవితాలకు భంగం కలుగుతుందని, సమస్యలు లేకుండా చూడాలని కోరారు. కాగా మరికొంతమంది గ్రామస్తులు మాట్లాడుతూ.. అభిప్రాయ సేకరణపై గ్రామ సర్పంచ్ చంద్రరావుకు, గ్రామస్తులకు కనీసం సమాచారం లేదని మండిపడ్డారు. సుర్జిని గ్రామంలో 110 కుటుంబాల్లో కనీసం 20 మంది కూడా సమావేశంలో లేరని అధికారుల ముందే ఆందోళన చేపట్టారు. క్వారీ యాజమాన్యం గ్రామానికి సంబంధం లేనివారితో కార్యక్రమాన్ని నిర్వహించడం సరికాదన్నారు. ఈ సందర్భంగా టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి మాట్లాడుతూ.. ప్రజలు చెప్పిందేపై అధికారులకు నివేదిక రూపంలో అందిస్తామన్నారు. ప్రజలు ఆందోళన చెందవద్దని కోరారు. కార్యక్రమంలో మైన్స్ ఏడీ విజయలక్ష్మి, పొల్యూషన్ ఈఈ కరుణశ్రీ, తహసీల్దార్ పాపారావు, సీఐ సన్యాసినాయుడు, క్వారీ ప్రతినిధి రౌతు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు

ఆమదాలవలస: పట్టణానికి చెందిన మెట్ట కృష్ణంరాజు వైఎస్సార్‌సీపీ జిల్లా వాణిజ్య విభాగం సెక్రటరీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ పార్టీ విజయానికి కష్టపడి పనిచేయాలని సూచించారు.

హిరమండలం: వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శిగా ఎల్ఎన్‌పేట మండలం శ్యామలాపురం ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన బలగ గోవిందరావు నియమితులైన విషయం తెలిసిందే. దీంతో తన నియామకానికి కృషి చేసిన వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతిని శుక్రవారం ఆయన కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో పాటు ఎల్ఎన్‌పేట మండల పార్టీ అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు తదితరులు ఉన్నారు.

పోలయ్యకు అభినందనలు

కొత్తూరు: వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా కమిటీ కార్యదర్శిగా కొత్తూరుకు చెందిన గుడబండి పోలయ్యను నియమించారు. దీంతో ఆయన మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతిని శుక్రవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు గండివలస ఆనందరావు, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, సర్పంచ్ రంజిత్, పార్టీ నాయకుడు వాసు తదితరులు ఉన్నారు. అలాగే జిల్లా ఎస్సీ విభాగ కమిటీ సెక్రటరీగా నియామకమైన వనుకు మోహనరావు సైతం రెడ్డి శాంతిని కలిశారు. ఆయనతో పాటు పార్టీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, ఐటీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఎనుగుతల సూర్యం, కార్యదర్శి గోకవలస రాము, కంతు మహంతి జీవేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఉపాధితో అనుసంధానమెన్నడో..?



ఎల్ఎన్‌పేటలోని వరిపంటలో కలుపు తీస్తున్న కూలీలు

- వ్యవసాయ రంగాన్ని వేధిస్తున్న కూలీల సమస్య
- ఏటా పెరుగుతున్న పెట్టుబడులు
- అనుసంధానం కోసం ఎదురుచూపులు

హిరమండలం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేస్తే రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం వచ్చిన తర్వాత వ్యవసాయ రంగంలో కూలీల కొరత ఏర్పడిందని, అందువలన ఉపాధి పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే కూలీల కొరత తీరుతుందని పేర్కొంటున్నారు. గతంలో అనుసంధానం చేస్తామని బీజేపీ, టీడీపీ ప్రభుత్వం హామీనిచ్చి గాలికి వదిలేసింది. అయితే ఈ సారైనా అమలు చేసి తమకు తోడ్పాటు అందిస్తారన్న ఆశలతో అన్నదాతలు ఎదురుచూస్తున్నారు

పెరుగుతున్న మదుపులు

వ్యవసాయ రంగంలో మదుపులు రోజురోజుకూ పెరుగుతుండడంతో రైతుల కష్టానికి తగిన ఫలితం రావడం లేదు. ప్రతీ ఏడాది ఎరువుల ధరలు కూడా పెరుగుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు ఎకరానికి రూ.25 వేల ఖర్చు అవుతోందని రైతులు చెబుతున్నారు. మొక్కజొన్న, వేరుశనగ, పత్తి తదితర పంటలకు కూడా భారీ మొత్తంలో పెట్టుబడులు పెట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత మొత్తంలో పెట్టుబడులు పెట్టి వ్యవసాయం చేసినా, పంటచేతికి వచ్చేంత వరకు నమ్మకం ఉండదని వాపోతున్నారు. దీనికి తోడు కూలీల పనులకు రోజుకు రూ.400లు, దమ్ములకు రూ.500ల నుంచి రూ.600లు ఇచ్చుకుంటూ ఒక పూట భోజనం కూడా పెట్టాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. ఈ క్రమంలో ఉపాధి హామీ పథకానికి వ్యవసాయాన్ని అనుసంధానం చేస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొన్ని పనులు చేసుకోవచ్చు



రైతుకు అవసరమయ్యే సాగునీటి పనులు ఉపాధి హామీ పథకంలో చేసుకోవచ్చు. చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, నీటి గుంతలు ఏర్పాటు తదితర పనులు ఉపాధి పథకంలో చేపట్టవచ్చు. రైతుల పొలాలు, వ్యవసాయ కూలీ పనులు ఉపాధి పథకంతో అనుసంధానం ప్రక్రియపై ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వం రైతులకు ఉపాధి పథకంలో తోడ్పాటు అందించడానికి ప్రస్తుతం సూచించిన పనులు చేపడుతున్నాం.

– ఎ.శ్రీనివాసరావు, ఉపాధి ఏపీవో, హిరమండలం

కూలీల సమస్య వెంటాడుతోంది



వ్యవసాయ రంగంలో రోజురోజుకూ కూలీల సమస్య వేధిస్తోంది. ఈ నేపథ్యంలో వ్యవసాయాన్ని ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. ప్రభుత్వాలు ఆ దిశగా ఆలోచిస్తే బాగుటుంది. దీనివలన ఖర్చులు తగ్గుతాయి.

– దీర్ఘాశీ లక్ష్మీనారాయణ, రైతు, పాత హిరమండలం

ప్రభుత్వాలు బాధ్యత తీసుకోవాలి



వ్యవసాయ రంగాన్ని ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత తీసుకోవాలి. కూలీల సమస్యతో రైతులు వ్యవసాయాన్ని విడిచిపెట్టే పరిస్థితి ఏర్పడుతోంది. ఉపాధి పనుల పేరుతో రూ.కోట్లతో ప్రభుత్వాలు పనులు చేపడుతున్నాయి. ఇవే పనులను వ్యవసాయ రంగంతో అనుసంధానం చేస్తే రైతు బాగుపడతాడు.

– ఉుకలాపు శ్రీనివాసరావు, రైతు, కిట్టాలపాడు

అధికారులు పక్షపాతం చూపుతున్నారు

- సర్వసభ్య సమావేశంలో సభ్యుల ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఆరంగి మురళి

నరసన్నపేట: ప్రతిపక్ష సభ్యులపై అధికారులు పక్షపాతం చూపుతున్నారని పలువురు సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాకివలస సర్పంచ్ మోహనరావు మాట్లాడుతూ నాలుగు నెలల క్రితం ఒక పనికి ప్రతిపాదనలు పంపగా, ఇప్పటివరకు జేఈ పరిశీలించడానికి రాకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే వీఎస్‌పురం సర్పంచ్ పుట్టా ఆదిలక్ష్మి మాట్లాడుతూ పని చేస్తామని తీర్మానం ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో సర్పంచ్‌ల పదవీకాలం త్వరలో పూర్తవనున్న నేపథ్యంలో వారి ప్రతిపాదనలకు సకాలంలో స్పందించాలని ఎంపీపీ ఆరంగి మురళి సూచించారు. దీనికి జేఈ బగ్గు నర్సింగరావు స్పందిస్తూ తన దృష్టికి వచ్చిన పనులు వెంటనే ఎగ్జిక్యూట్ అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

సక్రమంగా ఎరువులు పంపిణీ చేయాలి

ఎరువులు అధికార పార్టీకి చెందిన రైతులకే అందుతున్నాయని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆందోళన చెందారు. సభ్యుడు నేతింటి రాజేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ యూరియా సరఫరా మెరుగుపరచాలని, రైతులందరికీ ఒకే ప్రాతిపదికన పంపిణీ చేయాలని కోరారు. ఇప్పటికే మండలంలో చాలా మేరకు యూరియా సరఫరా చేశామని, రైతుల నుంచి డిమాండ్ ఉన్నందున మళ్లీ కావాలని ప్రతిపాదనలు పంపించామని వ్యవసాయాధికారి వై.సూర్యకుమారి తెలిపారు. వంశధార కాలువల్లో పనులు పూర్తిస్థాయిలో చేయకుండా కొంతమేరకు చేసి మిగిలిన భాగం వదిలేశారని, దీంతో కింద పొలాలు ముంపునకు గురవుతున్నాయని ఉర్లాం సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి అన్నారు. నూకాలమ్మ చానల్ పనులు వచ్చే సీజన్‌లో అయినా చేపట్టాలని, షట్టర్లు బాగు చేయాలని సభ్యులు, సర్పంచ్‌లు కోరారు. జలజీవన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయిలు వేస్తున్నప్పుడు రోడ్లు తవ్వేసి వదిలేశారని, దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని విప్ వైశ్యరాజు కేశవరాజు, కో–ఆప్షన్ సభ్యుడు రమణ సాహులు ఆర్‌డబ్ల్యూఎస్ తెలిపారు. మండల పరిషత్ పాలక వర్గాన్ని అవమానపరిచే విధంగా సభ్యుల తీర్మానం లేకుండా మండల పరిషత్ ఆవరణలో అన్న క్యాంటీన్ నిర్మాణానికి స్థలాన్ని అధికారులు కేటాయించడాన్ని ఎంపీపీతో సహా సభ్యులు వ్యతిరేకించారు. అన్నా క్యాంటీన్‌కు మండల పరిషత్ ఆవరణలో స్థలం ఇచ్చేందుకు ఇన్‌చార్జి ఎంపీడీవో విజయానంద కుమార్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ్యులు వ్యతిరేకించారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దాడులకు భయపడేది లేదు



రాంబాబును పరామర్శిస్తున్న కృష్ణ చైతన్య తదితరులు

జలుమూరు: కూటమి నాయకుల దాడులు, బెదిరింపులకు భయపడేది లేదని పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ధర్మాన కృష్ణ చైతన్య అన్నారు. గురువారం జలుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ తర్ర బలరాం, ఆయన సోదరుడు కృష్ణలు వైఎస్సార్‌సీపీ నాయుకుడు చింతం రాంబాబుపై దాడి చేశారు. దీంతో శ్రీముఖలింగంలో రాంబాబును కృష్ణ చైతన్య శుక్రవారం పరామర్శించి ధైర్యం చెప్పారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అధికారం ఉందన్న అహంకారంతో టీడీపీ నాయకులు దాడులకు పాల్పడడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, జిల్లా ఉపాధ్యక్షుడు బగ్గు రామకృష్ణ, మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, స్థానిక నాయకులు కె.హరి ప్రసాద్, బీవీ రమణ, లాడి రమేష్ గుప్తా, వైఎస్సార్‌సీపీ నాయకులు ధర్మాన జగన్, చింతాడ వెంకటరావు, బగ్గు లక్ష్మణరావు, మెండ కృష్ణారావు, పంచిరెడ్డి రాజారావు, సీపాన వేణు, యోగి, పల్లి రమణ, దేశల కృష్ణ, గుంట సింహాచలం, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రణభేరి విజయవంతం చేయండి



మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టనున్న రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి టీవీటీ భాస్కర్, యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల, గేదెలవానిపేట, మెట్టక్కివలస, మున్సిపల్ బాలికోన్నత, చింతాడ మున్సిపల్ ఉన్నత పాఠశాలలను సందర్శించి పోస్టర్ ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు తమ్మినేని పాపారావు, చింతాడ వెంకటరమణమూర్తి, మెండ శ్యామలరావు, ఎస్.ధనుంజయరావు, గొర్లె రమేష్, కె సిద్దు, కె.సాయి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మందస: వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు



హిరమండలం: తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

హిరమండలం: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీటీఎఫ్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం శుక్రవారం అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్నా సమస్యలకు ఎటువంటి పరిష్కార మార్గం చూపలేదన్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మందస: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్రవ్యాప్తంగా పిలుపునిచ్చిన నిరసన వారం కార్యక్రమంలో భాగంగా రెండో రోజు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

పాతపట్నం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగాయి. మండలంలోని కొరసవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం ఎంఈవోలు ఎ.గోవిందరావు, సీహెచ్ తిరుమలరావు, సారవకోట ఎంఈవో ఎం.వెంకటరమణలు పోటీలను పర్యవేక్షించారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ తదితర క్రీడా పోటీల్లో విద్యార్థులు పాల్గొని, తమ ప్రతిభ చాటుతున్నారు. మండల స్థాయిలో గెలిపొందిన క్రీడాకారులు డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ శేఖర్‌బాబు తెలిపారు.

కార్యక్రమంలో విశ్రాంత పీడీ మద్దు తాతయ్య, పీఈటీలు కృష్ణారావు, ప్రధానోపాధ్యాయుడు రమణ తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్‌లో తలపడుతున్న విద్యార్థులు

ఏపీఎం అక్రమాలపై దర్యాప్తు చేయాలి

కొత్తూరు: మండల మహిళ సమాఖ్య ఏపీఎం లలిత కుమారి అవినీతి, అక్రమాలపై దర్యాప్తు చేయాలని మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలితో పాటు కమిటీ సభ్యులు, గ్రామాఖ్య సంఘాల అధ్యక్షులు స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు శుక్రవారం ధర్నా చేపట్టారు. అనంతరం ఏపీఎం అక్రమాలపై విచారణ చేపట్టాలని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎంఎంఎస్ అధ్యక్షురాలు జయమ్మ తదితరులు మాట్లాడుతూ.. ఏపీఎం లలిత కుమారి బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మండల సమావేశాల్లో ఎంఎంఎస్ కమిటీ సభ్యులు, గ్రామ సమాఖ్య అధ్యక్షులను అగౌరవపరిచే విధంగా వ్యవహరిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎంఎస్‌కు మంజూరైన ఉల్లాస కార్యక్రమం నిధుల వినియోగంతో పాటు పలు రకాల నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని కోరారు. ఇదివరకే కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.